

బొడ్డెమ్మ..బొడ్డెమ్మా కోల్

తెలంగాణ భాష, యాస, పండుగలోనూ వైవిధ్యం కనిపించే బొడ్డెమ్మ వేడుక నేటి (ఆదివారం) నుంచి తొమ్మిది రోజుల పాటు జరుపుకోనున్నారు. - 8లో



రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు

వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో శనివారం విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడుల్లో రూ.30కోట్ల ధాన్యం నిల్వలు మాయమైనట్లు వెల్లడైంది. - 8లో

గరిష్టం/కనిష్టం
$31^0/23^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం మామూలు ఉష్ణోగ్రత ఉంటుంది. రాత్రి చల్ల గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సిద్ధేశ్వరాలయ హుండీ ఆదాయం రూ.4.32లక్షలు



బచ్చన్నపేట: మండలంలోని కొడవటూర్ గ్రామంలోని సిద్ధేశ్వరాలయ హుండీ ఆదాయం రూ.4,32,198లు వచ్చినట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి చిందం వంశీ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆలయ హుండీని మూడు నెలలకోసారి లెక్కించడం జరుగుతుందన్నారు. హుండీ లెక్కింపునకు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి వెంకటలక్ష్మి పర్యవేక్షణ అధికారిగా హాజరు కాగా ఆలయ ప్రధాన పూజారి ఓం నమఃశివాయ, సిబ్బంది లక్ష్మీకాంత్‌రెడ్డి, గంగం భానుప్రకాష్‌రెడ్డి, బండారి శ్రీనివాస్, అర్చకులు, శ్రీలక్ష్మి వేంకటేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

హిందూ, ముస్లింలు ఐక్యంగా ఉండాలి



జనగామ రూరల్: హిందూ, ముస్లింలు ఐక్యంగా ఉండాలని డీసీపీ రాజమహేంద్రనాయక్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గిర్నిగడ్డ ఏక్ మినార్ మజీద్‌లో ముస్లిం డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు, న్యాయవాది జమాల్ షరీఫ్, మోమిన్ యూత్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్, న్యాయవాది రఫీ మతిన్ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ జల్సా ముషయిరా పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ పార్థసారథి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. జిల్లాలో హిందూ ముస్లింలు ఐక్యతతో ఉండటం సంతోషకరమన్నారు. ఎల్లప్పుడు సోదర భావంతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

పాల బిల్లులు ఆలస్యం కాకుండా చూడాలి



జనగామ: విజయ డెయిరీ ఆధ్వర్యంలో రైతుల నుంచి సేకరిస్తున్న పాల బిల్లుల విడుదలలో జాప్యం కాకుండా చూడాలని జిల్లా విజయ డెయిరీ ఉత్పత్తి దారుల సహకార సంఘం సభ్యులు కోరారు. రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డి, ఉపాధ్యక్షుడు దామెర నాగరాజు, ప్రధాన కార్యదర్శి కుర్రెముల శ్రీనివాస్, కోశాధికారి ఎడబోయిన రవీందర్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి, వినతి చేశారు. పాల బిల్లుల ఆలస్యంపై చైర్మన్‌తో చర్చించగా త్వరగా విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. వారి వెంట డైరెక్టర్లు జంగిటి ఆంజనేయులు, బి.మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

కంచనపల్లి పీఏసీఎస్ ఉపాధ్యక్షుడిపై వేటు

- ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలు జరిగినట్లు అధికారుల గుర్తింపు

రఘునాథపల్లి: మండలంలోని కంచనపల్లి వ్యవసాయ సహకార సంఘం బాధ్యుల తీరు చర్చనీయాంశమైంది. సంఘంలోని డబ్బులు సొంతానికి వాడుకున్న విషయంలో అధ్యక్షుడు చీమలపాటి రవీందర్‌పై అనర్హత వేటు పడిన రెండు రోజుల్లోనే.. ఉపాధ్యక్షుడిపై డీసీఓ రాజేందర్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ధాన్యం కొనుగోలులో అవకతవకలకు పాల్పడి రైతులకు నష్టం చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్, ఉపాధ్యక్షుడు మూడ్ ధర్మను అనర్హుడిగా ప్రకటించారు. ఈ మేరకు జిల్లా కో ఆపరేటివ్ అధికారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కంచనపల్లి సొసైటీ పరిధిలోని కుసుంబాయితండా ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉపాధ్యక్షుడు ధర్మతో పాటు ట్యాబ్ ఆపరేటర్ రాజశేఖర్ ఎఫ్ఏక్యూ నిబంధనల ప్రకారం ఒక్కో గన్నీ బ్యాగులో 41 కిలోల ధాన్యం నింపాలి. కానీ 43- 44 కిలోల మేర ధాన్యం తూకం వేసినట్లు అధికారులు తేల్చారు. దీంతో ఉపాధ్యక్షుడి పదవికి ధర్మ అనర్హుడిగా పేర్కొంటూ తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఈ ఉత్తర్వులు అమలులో ఉంటాయని పేర్కొన్నారు.

- హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ పరిధి కో-ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలోకి ఈనెల 19న కొండచిలువ వచ్చింది. ఈఘటనకు వారం రోజుల ముందే క్యాంపస్‌లో ఓ కొండ చిలువ విద్యార్థులను భయ భ్రాంతులకు గురి చేసింది.
- గత నెల ఒకటో తేదీన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పనికర శివారు చంద్రుగొండ క్రాస్ రోడ్డు మీదుగా కొండచిలువ వచ్చింది. రైతులు, పాదచారులు భయాందోళనకు గురై కర్రలతో కొట్టి చంపారు. ఇదేచోట ఇప్పటికే వరి కోత మిషన్‌లో పడి ఓ కొండచిలువ మృతి చెందగా మరో కొండచిలువను పాదచారులు చంపారు.
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం మజీద్‌పల్లి వద్ద గత నెల 25న జనావాసాల్లోకి కొండచిలువ వచ్చింది. స్థానిక గుండం చెరువుగుండా రోడ్డుపైకి రావడంతో భక్తులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కొంత మంది యువకులు దాన్ని హతమార్చారు.





అతిథులను అడవికి చేర్చుదాం

జనావాసాల్లో కొండచిలువల సంచారం

- ఉక్కపోత, ఆహారం కోసం బయటికి..
- అవగాహన లేక చంపుతున్న ప్రజలు
- విష రహిత పాములుగా గుర్తింపు..
- హతమారిస్తే కఠిన శిక్షలు: అటవీ అధికారులు

మనిషి తన పరిధి దాటి చెరబట్టేందుకు అడవిబాట పడితే.. అడవినే నివాసంగా చేసుకుని బతుకుతున్న జీవాలు జనావాసాల బాటపడుతున్నాయి. ఈక్రమంలో బొరియల్లో తలదాచుకుని.. క్షీరదాల్ని, చిన్నచిన్న జీవుల్ని ఆహారంగా స్వీకరించే కొండచిలువలు అరణ్యంలో చెట్ల సంఖ్య తగ్గి.. ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరవుతున్నాయి. అడవిని వీడి జనావాసాలకు చేరుతున్నాయి. వాటిని హతమారిస్తే జైల్లో ఊచలు లెక్కపెట్టాల్సిందే. తప్పిపోయి వచ్చిన ఆ అతిథుల్ని అడవికి చేర్చాల్సిన బాధ్యత అందరిదీ.. ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లాలో సంచరిస్తూ ప్రాణాలు కోల్పోయిన పైథాన్‌లు ఎన్నో.. వాటి సంరక్షణ కోసం 'సాక్షి' ప్రత్యేక కథనం..

టోల్‌ఫ్రీకి కాల్ చేయండి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కడైనా కొండచిలువ కనిపిస్తే హనుమకొండలోని కాకతీయ వన విహార్‌కు సమాచారమివ్వాలని అటవీశాఖ రేంజ్ అధికారిణి శిరీష తెలిపారు. సెల్‌నంబర్ : 99898 73198, టోల్‌ఫ్రీ నంబర్ 1036కు సమాచారం ఇచ్చి కొండచిలువలను కాపాడాలని కోరారు.

భూపాలపల్లి/ఏటూరునాగారం: సాధారణంగా కొండచిలువలు కొండలు, గుట్టలు, గుహలు, రాళ్ల కింద ఆవాసం ఏర్పర్చుకుంటాయి. ఇవి ఎక్కువగా అడవిలో లభించే పందికొక్కులు, కోళ్లు, కుందేళ్లు, కీటకాలు, చిన్నచిన్న పక్షులు, అడవి పంది పిల్లలను ఆహారంగా తీసుకుంటాయి. అంతే కాకుండా నీరు తక్కువగా ఉన్న చిన్నచిన్న కుంటల్లోకి వెళ్లి ఈత కొడుతూ చేపలు, ఇతర జలరాశులను తింటాయి. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో బయటి వాతావరణం చల్లబడడం, బండల కింద ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడంతో ఉక్కపోత తట్టుకోలేక బయటకు వచ్చి జనావాసాల్లోని కోళ్లు, చిన్న లేగదూడలను పట్టుకొని తింటాయి.

షెడ్యూల్-1లో కొండచిలువ..

ప్రాధాన్యతాక్రమం ఆధారంగా వరల్డ్ వైడ్ రెడ్ లిస్ట్ బుక్‌లో జంతువులను వివిధ షెడ్యూల్స్‌లో పొందుపర్చారు. షెడ్యూల్-1, 2, 3.. ఇలా వివిధ రకాలున్నాయి. పర్యావరణంలో కీలక పాత్ర పోషిస్తూ, క్రమక్రమేణ ఆ సంతతి అంతరించిపోతున్న వన్యప్రాణులను షెడ్యూల్-1లో ఉంచారు. వీటికి అటవీశాఖ అధికారులు, ప్రజలు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి హాని తలపెట్టకుండా కాపాడాల్సి ఉంటుంది. ఈ షెడ్యూల్-1లో పులి, చిరుత, నక్షత్రాల తాబేలు, ఉడుములు, అడవి దున్న తదితర జంతువులతో పాటు కొండచిలువ ఉంది. ఈమేరకు పులిని చంపినా.. కొండచిలువను చంపినా ఒకే విధమైన కేసు నమోదు చేయాల్సి ఉంటుంది.

విష రహితం..

కొండచిలువ విషరహితమైన ప్రాణి. దీనికి భయపడాల్సిన అవసరం లేదని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఇది ఆహారాన్ని తీసుకునే ముందు సదరు ప్రాణిని చుట్టి అస్థిపంజరాన్ని బ్రేక్ చేస్తుంది. తద్వారా ఊపిరి ఆగిపోయి జంతువు లేదా పక్షి ఎటూ కదల్లేని స్థితికి చేరుకున్నాక నోటిని 180 డిగ్రీస్‌లో ఓపెన్ చేసి సులభంగా మింగుతుంది. వన్యప్రాణికి ఏది తినాలి.. ఏది తినకూడదు అనే విషయం తెలియదు కాబట్టి చంటి పిల్లల విషయంలో మాత్రం కొంత జాగ్రత్తగా ఉండాలని అధికారులు చెబుతున్నారు.

పాఠశాల ఆవరణలో కొండచిలువ
రైతు పొలంలో చేపల వలకు చిక్కి..
- 8లో

జనావాసాల్లోకి రావడానికి కారణాలు..
- వరదలు, భారీ వర్షపాతం వల్ల భూగర్భ బొరియలు నీటితో ముంచెత్తడం
- బండలకింద అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కపోత, బయట ఆహారం లభ్యత
- సంతానోత్పత్తి, సంభోగం కోసం (సహచరి కోసం)

ప్రభావిత ప్రాంతాలు..
- వ్యవసాయ భూములు, జనావాసాలు, నీటి వనరులు

ముందస్తు జాగ్రత్తలు..
- ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం
- ఇంటి ఆవరణలో ఎలుకలు తిరగకుండా చూడడం.. పశువులు, పెంపుడు జంతువులను భద్రపర్చడం, పొడవైన గడ్డి, దట్టమైన వృక్షాలు లేకుండా చూడడం

చంపడం చట్టరీత్యా నేరం



గ్రామాల్లో ఎక్కడ ఏ ప్రాంతంలో కొండచిలువ కనిపించినా చంపొద్దు. అడవుల్లో సంచరించే ఏ జంతువుకైనా హాని తలపెడితే వన్యప్రాణి చట్టాల ద్వారా కఠిన శిక్షలు ఉంటాయి. అందరూ ఈ విషయాన్ని గమనించాలి. కొండచిలువ కనిపిస్తే మాకు సమాచారం ఇవ్వాలి. మేం వాటిని పట్టుకుని అడవిలో వదిలిపెడతాం.

- అబ్దుల్ రహమాన్, ఎఫ్ఆర్ఓ, ఏటూరునాగారం

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: పంచాయతీ రాజ్ శాఖ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం జిల్లా పరిషత్ అభివృద్ధి పనుల ప్రగతిని జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ సీఈఓ సరిత ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పింకేష్‌కుమార్‌తో కలిసి 2022-23, 2023-24లో చేపట్టిన స్టేట్, సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్‌ల కింద ఎంపీపీ, జెడ్పీపీ గ్రాంట్‌ల కింద మంజూరైన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులను ఉపయోగించి పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టిన పనులకు ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి స్వరూప, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

సర్వే శాఖ పనితీరును మెరుగు పరుచుకోవాలి

సర్వేశాఖ పనితీరును మెరుగు పరుచుకోవాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో సహాయ సంచాలకులు ఆధ్వర్యంలో సర్వే శాఖ అధికారులు, సిబ్బందితో సర్వే పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే పనుల్లో జాప్యం తగదని, రోజువారీ లక్ష్యాలను రూపొందించుకోవాలని ఆదేశించారు. అక్టోబర్ 21వ తేదీలోగా సర్వేలన్నీ పూర్తి చేయాలని, గూగుల్ షీట్ రూపొందించి ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ఈ సమీక్షలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు మన్యం కొండ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

జనగామ: దేశంలో బాపూజీ అని గౌరవం దక్కిన రెండో వ్యక్తిగా పద్మశాలి బిడ్డ కొండా లక్ష్మణ్ బాపూజీ కీర్తించబడుతున్నారని పద్మశాలి అఫీషియల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (పోపా) అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, పద్మశాలి కల్యాణ మండపం నిర్మాణ కమిటీ చైర్మన్ కేఎల్ఎన్ స్వామి, టీసీ సొసైటీ అధ్యక్షుడు గుర్రం నాగరాజు అన్నారు. శనివారం బాపూజీ 12వ వర్ధంతి పురస్కరించుకుని జిల్లా కేంద్రం అంబేడ్కర్ విగ్రహం వద్ద పోపా అధికార ప్రతినిధి పిట్టల సతీష్ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. చేనేత కార్మికులకు చేనేత చేయూత పథకం పునఃప్రారంభించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏల జనార్దన్, మాదాసు ఎల్లయ్య, ఆంజనేయులు, మచ్చ బాల నర్సయ్య, రాందయాకర్, సురేందర్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పోపా నాయకులు

తల్లిదండ్రులు బాధ్యత వహించాలి

- డీఈఓ రాము

నర్మెట: విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలని డీఈఓ కె.రాము అన్నారు. మల్కపేట ప్రాథమిక పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పిల్లల ప్రవర్తనను కదలికలను గమనించడంతో పాటు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించినపుడే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో సమకూర్చిన స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు, ప్లేట్స్, వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఓ ఎం. ఐలయ్య, హెచ్ఎం జి. కేశవరావు, ఉపాధ్యాయులు కె. అంజనేయులు, కె. మధుసూదన్, ఏఏసీపీ సులోచన, సీఆర్పీ రవీందర్, కార్యదర్శి అనందాసు కల్యాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



స్కూల్ బ్యాగులు అందజేస్తున్న డీఈఓ రాము

అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీ బీజేపీనే

- కేంద్ర సహాయ మంత్రి జార్జి కురియన్

జనగామ రూరల్: దేశంలో అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీ బీజేపీనే అని కేంద్ర సహాయ మంత్రి జార్జి కురియన్ అన్నారు.శశనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి అధ్యక్షతన జిల్లా పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యకర్తలకు పార్టీ విధానాలు, సభ్యత్వ నమోదుపై దిశ నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో దేశం పురోగతి సాధిస్తుందన్నారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి కృషి చేసి అధికారమే లక్ష్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. బీజేపీలో ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని, ప్రతీ బూత్‌లో లక్ష్యం పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మూర్తినేని ధర్మారావు, కేవీఎల్ఎన్ రెడ్డి, ఉడుగుల రమేష్, శివరాజ్, మండల, పట్టణ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి జార్జి కురియన్

నిడిగొండ పీఏసీఎస్ అక్రమాలపై విచారణ

- కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి అధికార బృందం

సాక్షి ఎఫెక్ట్

జనగామ: రఘునాథపల్లి మండలం నిడిగొండ ప్రాథమిక సహకార సొసైటీ (పీఏసీఎస్)లో జరిగిన అక్రమాలపై కలెక్టర్ రిజ్వాన్ బాషా విచారణకు ఆదేశించారు. ఈ నెల 21న సాక్షిలో 'ఒకే ఆధార్.. పది మందికి లింకు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. స్టేషన్‌ఘన్‌పూర్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ దివ్య బృందం ఆధ్వర్యంలో ఈ నెల 23న విచారణ ప్రారంభించనున్నారు. నిడిగొండ పీఏసీఎస్‌లో ఆధార్ నంబర్ కేటాయింపుల్లో అవకతవకలతో పాటు అప్పు తీసుకోని రైతులకు సైతం తీసుకున్నట్టుగా రికార్డులు రాసి నోటీసులు పంపించిన సంగతి తెలిసిందే. పంట రుణంలో జరిగిన అక్రమాలతో పాటు ఆధార్ తప్పుగా నమోదు చేశారని రైతులు స్వయంగా బయటకు వచ్చే వరకు సొసైటీ అధికారులు నిద్రమత్తు వీడక పోవడం గమనార్హం. ఈ విషయమై సాక్షిలో ప్రచురితమైన వరుస కథనాలతో కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారిస్తూ..విచారణకు ఆదేశాలు జారీ చేశారు.

అక్రమాలపై లోతైన విచారణ

నిడిగొండ పీఏసీఎస్ పరిధిలో పది గ్రామాలు ఉండగా...3,763 మంది సభ్యులున్నారు. ఇందులో రూ.2 లక్షలోపు పంట రుణ మాఫీ స్కీంకు 554 మంది రైతులు అర్హత ఉన్నారు. రాష్ట్రమంతటా రుణమాఫీ జరిగి రైతులు సంతోషంగా ఉన్న సమయంలో నిడిగొండ పీఏసీఎస్ రైతులు ఆందోళన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఈ నెల 23న పీఏసీఎస్‌కు బాధిత రైతులను పిలిపించి సమగ్ర విచారణ జరుపనున్నారు.



నిడిగొండ పీఏసీఎస్ కార్యాలయం

ఆడిట్ జరిపిస్తే మరిన్ని అక్రమాలు..

జిల్లాలోని పలు పీఏసీఎస్‌ల్లో అనేక అక్రమాలు జరిగినట్లు ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ ఆ దిశగా దృష్టి సారించాలని పలువురు రైతులు కోరుతున్నారు. బచ్చన్నపేట, లింగాలఘణపురం మండలం క్లెయిం తదితర పీఏసీఎస్ పరిధిలో అక్రమాలు జరిగినట్లు గతంలో ఫిర్యాదు వచ్చిన సంగతి తెలిసిందే. నిడిగొండ పీఏసీఎస్ కాకుండా జిల్లా అంతటా సభ్యుల (రైతుల) సమక్షంలో ఆడిట్ జరిపిస్తే రూ.కోట్లలో అక్రమాలు తేలే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది.

ధాన్యం కొనుగోళ్లపై అనేక ఆరోపణలు

వానాకాలం, యాసంగి సీజన్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (ఐకేపీ)తో పాటు పీఏసీఎస్ సొసైటీలకు ధాన్యం కొనుగోళ్ల బాధ్యతలను అప్పగిస్తారు. ధాన్యం కొనుగోలు సమయంలో పీఏసీఎస్‌ల పరిధిలో అక్రమాలు జరిగినట్లు ఫిర్యాదులు వచ్చినట్లు తెలుస్తుండగా, బయటకు రాకుండా జాగ్రత్తలు పడుతున్నారనే ప్రచారం లేకపోలేదు. ఎరువుల అమ్మకాలు, రుణాలపై వడ్డీలు తదితర వాటిపై సభ్యుల సమక్షంలో విచారణ జరిపిస్తే జిల్లాలోని అనేక సొసైటీల్లో ఇన్నాళ్లుగా జరుగుతున్న అక్రమాలు వెలుగు చూస్తాయని పలువురు రైతులు అభిప్రాయ పడుతున్నారు.

రేపే విచారణ చేస్తాం..

ఈ నెల 23న నిడిగొండ పీఏసీఎస్‌లో విచారణ చేస్తాం. పంట రుణం తీసుకోకున్నా..తీసుకున్నట్టు చూపిస్తున్నారని రైతుల ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో బాధితులను పిలిపించి, సమగ్ర విచారణ చేస్తాం. విచారణ అనంతరం పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందిస్తాం.

- దివ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్, విచారణాధికారి

ప్రయాణికులతో మర్యాదగా మెలగాలి



ప్రయాణికురాలికి పువ్వు అందిస్తున్న డీఎం స్వాతి

జనగామ: ప్రయాణికులతో మర్యాదగా మెలగాలని డీఎం స్వాతి అన్నారు. శనివారం ఆర్టీసీ మర్యాద దినోత్సవాన్ని పురస్కరించుకుని డీఎం స్వాతి, ట్రాఫిక్ సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో ప్రయాణికులకు పువ్వులు ఇచ్చి వారితో మర్యాదగా మాట్లాడి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణికులే ఆస్తి, వారి గౌరవానికి భంగం కలుగకుండా ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలన్నారు. అంతకుముందు హైదరాబాద్ ఉప్పల్‌లో జనగామ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బయలు దేరే సమయంలో తిమ్మాపూర్‌కు చెందిన అజీజా, బిపాషా ఇద్దరు మహిళా ప్రయాణికులు తన బ్యాగును మరచిపోయి, మరో బస్సులో వెళ్లి పోగా.. కండక్టర్ వాటిని డిపో అధికారులకు అప్పగించారు. ఇద్దరు మహిళా ప్రయాణికులకు సమాచారం అందించి బ్యాగులో ఉన్న రూ. 4,600 నగదు, వస్తువులను డీఎం స్వాతి, సూపర్‌వైజర్ల చేతుల మీదుగా వారికి అందించారు.

యశోద హాస్పిటల్స్
యశోద మెడికల్ సెంటర్
1వ అంతస్థు, జై గోవింద్ కాంప్లెక్స్, ఎస్‌బిఐ పక్కన, నక్కలగుట్ట, హన్మకొండ
సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది - సమయం
న్యూరాలజీ కన్సల్టేషన్: పక్షవాతము, ఎపిలెప్సీ (మూర్ఛ), తలనొప్పి, మైగ్రేన్, మెడ / వెన్ను నొప్పి, మతిమరుపు, పార్కిన్ సన్స్, నరాల బలహీనతలు, వణుకు/ నడక ఇబ్బంది,మెదడుకు సంబంధించిన ఇతర జబ్బులు	డా॥ శివరామ్ రావు కె, [illegible], కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్	24-09-2024 4వ మంగళవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు
రక్త సంబంధిత వ్యాధులు: ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గడం పెరగడం, బ్లడ్ క్యాన్సర్, లింఫోమా, మైలోమా, రక్తహీనత, రక్త సంబంధిత వ్యాధులు అన్ని రకాల బ్లడ్ క్యాన్సర్ సంబంధిత వ్యాధులు	డా॥ శివ కుమార్ కె, MBBS, DNB (Gen Medicine), DNB (Hematology), అసోసియేట్ కన్సల్టెంట్ హెమటాలజీ, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్	
క్యాన్సర్ వ్యాధులకు కన్సల్టేషన్: మానని పుండ్లు, రొమ్ములో కణుతులు, గర్భసంచి క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, జీర్ణకోశ క్యాన్సర్, రెక్టమ్ క్యాన్సర్, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్ మరియు ప్రోస్టేట్ క్యాన్సర్	డా॥ హేమంత్ ఉదయరాజు, MS (General Surgery), MCh (Surgical Oncology), DNB (Surgical Oncology), డైరెక్టర్ అంకాలజీ & క్లినికల్ [illegible] సర్జన్ & రోబోటిక్ సర్జన్, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్	25-09-2024 4వ బుధవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు
ఆర్థోపెడిక్ / కీళ్ళమార్పిడి కన్సల్టేషన్: మోకాళ్ళు, తుంటి, మోచేయి, కీళ్ళ మార్పిడి, మరియు ఎముకల సంబంధిత వ్యాధులు	డా॥ సతీష్ బాన్, MBBS, DNB, MCh, MNAMS (Orthopaedic Surgery), [illegible], సీనియర్ కన్సల్టెంట్ ఆర్థోపెడిక్ సర్జన్, యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ	26-09-2024 4వ గురువారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు
వెన్నెముక వ్యాధులకు కన్సల్టేషన్: నడుము నొప్పి, మెడ నొప్పి, కాళ్ళు, చేతులు తిమ్మిర్లు, నరాల ఒత్తిడి సమస్యలు వెన్నెముక (ఫ్రాక్చర్ ట్రీట్‌మెంట్స్), పార్శ్వగూని చికిత్స(స్కోలియోసిస్ సర్జరీ), వెన్నెముక ఇన్‌ఫెక్షన్, అడ్వాన్స్‌డ్ స్పైనల్ టెక్నిక్స్	డా॥ వంశీ కృష్ణ వర్మ పి, MS (Orthopaedics), Fellowship in Spine Surgery (Sweden), [illegible], సీనియర్ కన్సల్టెంట్ స్పైన్ సర్జన్, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్	
కిడ్నీ వ్యాధులకు కన్సల్టేషన్: కిడ్నీ మార్పిడి అవసరం ఉన్న వాళ్ళు, డయాబెటిస్ వల్ల వచ్చే కిడ్నీ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులలో మూత్రపిండాల సమస్యలు, క్రానిక్ & అక్యూట్ కిడ్నీ వ్యాధి సమస్యలు, హీమోడయాలసిస్ మరియు పెరిటోనియల్ డయాలసిస్ సమస్యలు	డా॥ అరుణ్ కుమార్ పొన్న, [illegible], కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, యశోద హాస్పిటల్స్, సోమాజిగూడ	27-09-2024 4వ శుక్రవారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు
ఊపిరితిత్తుల వ్యాధులకు కన్సల్టేషన్: దీర్ఘకాలిక దగ్గు,శ్వాసలో గురక, శ్వాస తీసుకోవటంలో కష్టం, టీబి (క్షయ), ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్, ఊపిరితిత్తుల క్యాన్సర్, ఆస్తమా, అలర్జీ మరియు సిఒపిడి	డా॥ సాయి రెడ్డి, MD, [illegible] (Pulmonology), కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్	
క్యాన్సర్ వ్యాధులకు కన్సల్టేషన్: మానని పుండ్లు, రొమ్ములో కణుతులు, గర్భసంచి క్యాన్సర్, థైరాయిడ్ క్యాన్సర్, జీర్ణకోశ క్యాన్సర్, రెక్టమ్ క్యాన్సర్, నోటి క్యాన్సర్, గొంతు క్యాన్సర్ మరియు ప్రోస్టేట్ క్యాన్సర్	డా॥ శరత్ ఎ వాస్కాని, MD, DM (Medical Oncology), [illegible], కన్సల్టెంట్ మెడికల్ అంకాలజిస్ట్ & హెమటాలజిస్ట్, యశోద హాస్పిటల్స్, సికింద్రాబాద్	28-09-2024 4వ శనివారం ఉదయం10 గం॥ నుండి మధ్యాహ్నం 3 గం॥ వరకు

అపాయింట్‌మెంట్ కొరకు: 0870 - 2427777 | 2447778 | 2447779 | 707 570 4542

క్లుప్తంగా

నేడు, రేపు జిల్లా స్థాయి క్రికెట్ జట్టు ఎంపిక

వరంగల్ స్పోర్ట్స్ : దేశాయిపేటలోని సీకేఎం కళాశాల మైదానంలో 22, 23 తేదీల్లో (ఆది, సోమవారం) అండర్–19 ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రికెట్ ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండ్రోజుల పాటు జరగనున్న ఎంపికలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో జిల్లా స్థాయి జట్టును ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు 2005, సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆయా తేదీల్లో ఉదయం 10గంటలకు సీకేఎం కళాశాల గ్రౌండ్ వద్దకు క్రికెట్ యూనిఫాం, సొంత కిట్‌తో పాటు పుట్టినతేదీ, ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో, బోనోఫైడ్ ప్రోగ్రెస్ సర్టిఫికెట్లతో రావాలని సూచించారు.

టేకు కలప స్వాధీనం

● కరకట్ట వెంట అక్రమంగా నిల్వలు



స్వాధీనం చేసుకున్న టేకు దుంగలు

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని గోదావరి కరకట్ట వెంట అక్రమంగా నిల్వ చేసిన టేకు దుంగలను అటవీశాఖ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ విలేకరులతో మాట్లాడుతూ ఓడవాడ వెంట ఉన్న కరకట్టకు సమీపంలో అక్రమంగా టేకు దుంగలు ఉన్నట్లు సమాచారం అందడంతో తనిఖీ చేపట్టామన్నారు. అక్కడ 12 టేకు దుంగలు ఉండడంతో వాటిని రేంజ్ కార్యాలయానికి తరలించామని చెప్పారు. వాటి విలువ రూ. 3లక్షలు ఉంటుందని, ఆ కలప ఎవరిది అనే దానిపై విచారణ చేపడుతున్నామన్నారు.

సైబర్ కమాండో శిక్షణకు ప్రశాంత్‌కుమార్ ఎంపిక

వరంగల్ క్రైం : ప్రతిష్టాత్మకమైన సైబర్ కమాండో శిక్షణకు తెలంగాణ నుంచి వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో డిప్యూటీ ఏసీగా విధులు నిర్వర్తిస్తున్న ఏ.ప్రశాంత్‌కుమార్ ఎంపికయ్యారని సీపీ అంబర్ ఝా తెలిపారు. సైబర్ కమాండోకు ఎంపికైన పోలీసులకు ఆరు నెలల పాటు తమిళనాడులోని తిరుచ్చి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో(ఐఐటీ) వీరికి సైబర్ నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు, దర్యాప్తు, న్యాయవిచారణ మొదలైన అంశాలపై శిక్షణ అందజేస్తారని ఆయన పేర్కొన్నారు. ప్రతిభ కలిగిన పోలీస్ అధికారులను గుర్తించి ప్రోత్సహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా.. ప్రశాంత్ కుమార్‌ను అభినందిస్తూ, శిక్షణ తరగతుల ఎంపికకు సంబంధించిన ఉత్తర్వులు అందజేశారు.



బొడ్డెమ్మ..బొడ్డెమ్మా కోల్

● నేటినుంచి బొడ్డెమ్మ వేడుకలు
● నానాటికి ప్రాభవం కోల్పోతున్న పండుగ





హన్మకొండ కల్చరల్ : బొడ్డెమ్మ.. బొడ్డెమ్మా కోల్.. అంటూ తెలంగాణ భాష, యాసలోనూ అంతే కాకుండా పండుగలలోనూ వైవిధ్యం కనిపిస్తోంది. బతుకమ్మ బిడ్డ బొడ్డెమ్మ అంటారు. ఈ పండుగ పిల్లలకే ప్రత్యేకం. వాళ్లు ఆడుతూ, పాడుతూ ఉంటే పెద్దలు ముచ్చటపడి పోతుంటారు. భాద్రపద బహుళ పంచమి(ఆదివారం) నుంచి చతుర్దశి వరకు బొడ్డెమ్మ పండుగను నిర్వహిస్తారు. పిల్లలు చెరువు మట్టి లేదా పుట్ట మట్టిని తెచ్చి చెక్కపీటపై బొడ్డెమ్మను తయారు చేస్తారు. ఇది ఐదు దొంతరలుగా వలయాకారంలో ఉంటుంది. నాలుగువైపుల మిద్దెలాగా ఏర్పాటు చేస్తారు. ఇది సర్వతోభద్ర వలయంలా కన్పిస్తోంది. దీన్ని ఎర్రమట్టితో అలికి బియ్యం పిండి, కుంకుమ, పసుపుతో అలంకరించి, ముగ్గులు వేస్తారు. ఐదు అంతస్తులపైన చివరిభాగంలో చెంబును కలశంలా పెట్టి అందులో బియ్యం పోస్తారు. పైన రవికను చుట్టి తమలపాకులో పసుపు గౌరమ్మను ప్రతిష్టిస్తారు. ఈ బొడ్డెమ్మను దేవుడి గదిలో పెట్టి పూజిస్తారు. సాయంత్రం ఇంటి వాకిట్లో అలుకు చల్లి చుక్కల ముగ్గులు వేసి పీట బొడెమ్మను తెచ్చి ప్రతిష్టించి సాయంత్రం పూసే ఉద్రాక్ష, బీర, మల్లె, జాజిపూలతో అలంకరించి ఫలహారాలు పెట్టి చుట్టూ తిరుగుతూ బొడ్డెమ్మ పాటలు పాడుతారు. చివరగా బొడ్డెమ్మను నిద్రపుచ్చే పాటలు పాడుతారు. పాడడం అయిపోయాక తెచ్చుకున్న పప్పు ఫలహారాలు ఒకరినొకరు ఇచ్చిపుచ్చుకుని బొడ్డెమ్మను ఎవరింట్లో ఆడుతున్నారో వారింట్లోనే దేవుని దగ్గర పెట్టి వెళ్లిపోతారు. ఇలా తొమ్మిదిరోజులు ఆడిన తర్వాత చివరిరోజు సాగనంపే పాటలు పాడి బావిలో నిమజ్జనం చేస్తారు. బొడ్డెమ్మను బావిలో వేసిన తెల్లారి బతుకమ్మ పండుగ ప్రారంభమవుతుంది. బొడ్డెమ్మ పండుగను తెలంగాణలోని వివిధ జిల్లాలలో కొన్నిచోట్ల గుంటబొడ్డెమ్మగా , బాయి బొడ్డెమ్మగా కూడా జరుపుకుంటారు. దీని కోసం చిన్న గుంత తవ్వి చుట్టూ అలుకుతారు. ఉద్రాక్ష, బీర, మల్లె, జాజిపూలతో అలంకరించి గుంతలో నీళ్ల పోసి పాటలు పాడుతారు. బతుకమ్మ పండుగను తెలంగాణ సంస్కృతికి చిహ్నంగా గుర్తించిన గత ప్రభుత్వం బతుకమ్మ పండుగను పెద్ద ఎత్తున నిర్వహిస్తోంది, కానీ బొడ్డెమ్మను బతుకమ్మ పండుగతో విడదీయరాని భాగమని గుర్తించాలి.

పెద్దలు ప్రోత్సహించాలి



చదువులతో తీరిక లేకుండా పిల్లలు ఉండటం, పండుగ ఏలా జరుపుకోవాలో చెప్పడానికి పెద్దలు అందుబాటులో ఉండకపోవడం ఇతర కారణాల వల్ల రానురాను బొడ్డెమ్మ పండుగ కనుమరుగవుతోంది. ఇది బాధాకరం. పిల్లలు ఆడుకునే విధంగా పెద్దలే ప్రోత్సహించాలి. బతుకమ్మ అంటే గౌరీదేవి. గౌరీదేవికి పాటలు పాడుతూ కొలవడం అన్నమాట. అలాంటిది చెప్పులు వేసుకుని బొడ్డెమ్మ, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ ఆడటం సరైంది కాదు.

– గంగు ఉపేంద్రశర్మ, ప్రధానార్చకుడు, వేయిస్తంభాల దేవాలయం

నానాటికి ప్రాభవం కోల్పోతోంది



ప్రతి పండుగలోనూ పిల్లలను భాగస్వాములను చేయాలి. నానాటికి ప్రాభవం కొల్పోతున్న పండుగ బొడ్డెమ్మ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేలా పిల్లలను ప్రోత్సహించాలి. బొడ్డెమ్మను కూడా పాఠశాలలోని పిల్లలకు తెలిసేలా చేసి, ఆడించాలి.

– సిద్ధోజు కళావతి, కాశిబుగ్గ, వరంగల్

బొడ్డెమ్మా..బొడ్డెమ్మా వలలో..
బిడ్డాలెందారే వలలో..
నీబిడ్డ నీలగౌరు వలలో
నిత్యమల్లె చెట్టెక్కే వలలో
నిత్యమల్లె చెట్టుకూ వలలో
నీళ్లు పోయ్యాపోయే వలలో
నీళ్ల కంచూనోనూ వలలో
కొత్తచీర కట్టే వలలో
ఆ చీర కట్టుకా వలలో
కొంగలబావి కెళ్తేవలలో
కొంగలన్నీ కలసి వలలో
కొంగంతా చూసే వలలో
ఆచీర కట్టుకోని వలలో
హంసల బావికెళ్తే వలలో
హంసలన్నీ కలసి వలలో
అంచంతా చూసే వలలో
ఆచీర కట్టు కాలు వలలో
బాతుల బావికెళ్తే వలలో
బాతులన్నీ కలసీ వలలో
బట్టంతా చూసే వలలో
ఆచీర కట్టుకా వలలో
చిలుకల బావికెళ్తే వలలో
చిలుకలన్నీ కలిసి వలలో
చీరంతా చూసే వలలో

అంటూ పాటలు పాడుతారు. అనంతరం పప్పు, బెల్లం నైవేద్యంగా పెట్టి బొడ్డెమ్మను నిద్రపుచ్చుతారు.

బొడ్డెమ్మను నిద్రపుచ్చడానికి..

నిద్రపో బొడ్డెమ్మ.. నిద్రపోవమ్మా
నిద్రకు నూరేండ్లు..
నీకు వెయ్యేండ్లు
నినుగన్న తల్లికి నిండు నూరేండ్లు
జోజో..

అంటూ పాటలు పాడుతారు. తొమ్మిది రోజుల తర్వాత బొడ్డెమ్మను బావిలో నిమజ్జనం చేస్తారు. చివరిరోజు కలశంలో పోసిన బియ్యాన్ని పరమాన్నంగా బెల్లం కలిపి ప్రసాదంగా స్వీకరిస్తారు. రవిక బట్టను పెండ్లీడు అమ్మాయిలు కుట్టించుకుంటారు.

బొడ్డెమ్మ.. బొడ్డెమ్మ..
బిడ్డాలెందరే
బావిల పద్ద వారికి బారిద్దరమ్మా
చెర్లపద్ద వారికి చేరిద్దరమ్మా
కుంట్లబద్ద వారికి కోరిద్దరమ్మా
నిద్రబో బొడ్డెమ్మ.. నిద్రబోవమ్మా
నిద్రకు నూరేండ్లు..
నీకు వెయ్యేండ్లు
నినుగన్న తల్లికి నిండానూరేండ్లు

బొడెమ్మ పండుగ జరుపుకునే కాలంలో అనుములు, పెసర్లు, మొక్కజొన్నలు పండుతాయి. ఈ ధాన్యాల పేర్లన్నీ బొడ్డెమ్మ పాటల్లో కనిపిస్తాయి. శివుడి భార్యలైన గంగ, గౌరీల కలహాలు ప్రధానంగా ఉంటాయి.

కన్నతల్లిని కడతేర్చిన కొడుకు

● గ్యాస్ పత్రాలు, భూమి, డబ్బుల విషయమై అర్ధరాత్రి గొడవ
● ఇనుప పైపుతో దాడి.. అక్కడికక్కడే తల్లి మృతి



కత్తుల లక్ష్మి(ఫైల్)



నిందితుడి అరెస్టును చూపుతున్న సీఐ వేణు

స్టేషన్‌ఘన్‌పూర్: గ్యాస్ పత్రాలు, భూమి, డబ్బుల విషయమై గొడవ పడిన కొడుకు ఇనుప పైపుతో తల్లిని కొట్టి చంపిన ఘటన జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం నమిలిగొండలో జరిగింది. గ్రామస్తులు, మృతురాలి పెద్దకుమారుడు కత్తుల రాజు పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నమిలిగొండకు చెందిన కత్తుల లక్ష్మి(65)కి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. అందరికీ వివాహం అయింది. పెద్దకుమారుడు రాజు స్వగ్రామంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా.. చిన్న కుమారుడు సతీష్ కాజీపేటలో భార్య పిల్లలతో ఉంటున్నాడు. గతంలో ఓ చిట్‌ఫండ్‌లో పనిచేసిన సతీష్‌కు మూడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పటి నుంచి ఖాళీగా ఉంటున్నాడు. భార్య ప్రైవేట్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది. గ్యాస్ సబ్సిడీ పత్రాల కోసం ఈనెల 20న సతీష్, భార్య మమత కలిసి నమిలిగొండకు వచ్చారు. సాయంత్రం మమత కాజీపేటకు వెళ్లింది. కొడుకు ఇంటికి వచ్చాడని తల్లి లక్ష్మి చికెన్ వండగా రాత్రి కలిసి భోజనం చేశారు. ఇంట్లో వెనుకవైపు గదిలో తల్లి, ముందువైపు గదుల్లో పెద్ద కుమారుడు, కోడలు, పిల్లలు ఉంటారు. అయితే శుక్రవారం రాత్రి సతీష్ తల్లి గదిలోనే ఉన్నాడు. అర్ధరాత్రి తర్వాత గ్యాస్ కనెక్షన్, విద్యుత్ మీటరుతో పాటు భూమి, డబ్బుల విషయమై గొడవ పడిన సతీష్ ఇనుప పైపుతో తల్లి తలపై కొట్టగా ఆమె కేకలు వేసింది. దీంతో పెద్దకొడుకు రాజు వచ్చాడు. అతడి పైకి సతీష్ వెళ్లడంతో బయటికి పరుగులు తీసి చుట్టుపక్కల వారిని పిలిచాడు. వెంటనే డయల్–100 కు ఫోన్ పోలీసులకు సమాచారం ఇచ్చి ఇంటిలోకి వెళ్లి చూసేసరికి తల్లి లక్ష్మి రక్తపుమడుగులో పడి మృతి చెంది ఉంది. విషయం తెలుసుకున్న సీఐ జి.వేణు, ఎస్సై వినయ్ పోలీసులతో అక్కడికి చేరుకుని పరిశీలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకెళ్లారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. నిందితుడు సతీష్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా.. మూడేళ్ల క్రితం యాక్సిడెంట్ అయినప్పటి నుంచి సతీష్ మతిస్థిమితం సరిగ్గా లేదని గ్రామస్తులు చెబుతున్నారు.

కొండ చిలువల కలకలం



కొండ చిలువను పట్టుకున్న అధికారులు

కమలాపూర్: మండల కేంద్రానికి చెందిన రైతు జన్ను భిక్షపతి పొలంలో భారీ కొండచిలువ కనిపించింది. రైతు శనివారం తన పొలానికి ఎరువులు చల్లుతుండగా సమీప బావి వద్ద చేపల కోసం ఏర్పాటు చేసిన వలకు భారీ కొండ చిలువ చుట్టుకొని కనిపించింది. దీంతో భిక్షపతి, సమీప రైతులు కలిసి పాములు పట్టే అనాక్‌కు సమాచారం ఇచ్చారు. అనాక్ అక్కడికి వచ్చేసరికి వలకు చుట్టుకున్న కొండ చిలువ మృతి చెందింది. సుమారు 8 ఫీట్ల పొడవు.. భారీ ఆకారంతో ఉండడంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

అడవిలో వదిలిన అధికారులు

శాయంపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో శనివారం కొండచిలువ ప్రత్యక్షమైంది. గమనించిన ప్రధానోపాధ్యాయుడు సురేందర్ అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన అటవీ క్షేత్రాధికారి భిక్షపతి ఆదేశాల మేరకు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మైసయ్య కొండ చిలువకు ఎలాంటి హాని తలపెట్టవద్దని ప్రధానోపాధ్యాయుడికి తెలిపి పాఠశాలకు చేరుకున్నారు. గ్రామస్తులు శివప్రసాద్, బోయ రాజు సహాయంతో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల వెనుక చిత్తడి ప్రదేశంలో ఉన్న ఎనిమిది అడుగుల పొడుగు, 20 కిలోల బరువున్న రాక్ పైథాన్‌ను చాకచక్యంగా పట్టుకున్నారు. కాట్రపల్లి అటవీ ప్రాంతంలో వదిలేసినట్లు ఫారెస్ట్ అధికారి మైసయ్య తెలిపారు. కొండ చిలువ షెడ్యూల్ ఎనిమల్ అని, దానికి ఎలాంటి హాని తలపెట్టవద్దని విద్యార్థులకు వివరించారు. ఇలాంటి పాములు కనిపిస్తే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

యశ్వంత్‌పూర్–నిజాముద్దీన్ రైళ్ల హాల్టింగ్ రద్దు

● నిజామాబాద్ మీదుగా దారి మళ్లింపు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా నడిచే యశ్వంత్‌పూర్, నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కాజీపేటలో తాత్కాలికంగా కొన్ని రోజుల పాటు హాల్టింగ్ తొలగించి నిజామాబాద్ మీదుగా దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు.ఈ నెల 23వ తేదీ సోమవారం నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు కాజీపేట మీదుగా ప్రయాణించే యశ్వంత్‌పూర్–నిజాముద్దీన్ (12649) ఎక్స్‌ప్రెస్ వయా కాచిగూడ, కాజీపేట, బల్లార్షా, నాగపూర్ కాకుండా కాచిగూడ, నిజామాబాద్, ముద్కేడ్, పింపాల్‌కుటి, నాగపూర్, బల్లార్షా మీదుగా ప్రయాణిస్తోంది. అదేవిధంగా నేడు(ఆదివారం) నిజాముద్దీన్–యశ్వంత్‌పూర్ (12650) వెళ్లే నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ కాచిగూడ, కాజీపేట, బల్లార్షా, నాగపూర్ కాకుండా వయా కాచిగూడ, నిజామాబాద్ మీదుగా ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు.

సన్నబియ్యం పేరుతో రేషన్ బియ్యం విక్రయం

కమలాపూర్ : జైశ్రీరాం బియ్యం అని రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ హరికృష్ణ శనివారం తెలిపారు. విజయవాడకు చెందిన కావిరి వెంకటేశ్వర్లు, వేముల వెంకటేశ్వర్లు వివిధ గ్రామాల్లో రేషన్ బియ్యం కొనుగోలు చేసి వాటిని జై శ్రీరాం పేరు కలిగిన 25 కిలోల సంచుల్లో నింపి ప్రజలకు విక్రయిస్తున్నారు. శుక్రవారం వంగపల్లిలో స్కూటీపై తిరుగుతూ బియ్యం అమ్ముతుండగా మోసాన్ని పసిగట్టిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వీరిపై కేసు నమోదు చేసి స్కూటీతో పాటు రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు

● రూ.30 కోట్ల ధాన్యం నిల్వలు మాయం
● యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు



మొగిలిచర్ల మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు

సంగెం : వరంగల్, మహబూబాబాద్ జిల్లాల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు రైస్ మిల్లులపై శనివారం దాడులు నిర్వహించగా సుమారు రూ.30 కోట్ల నిల్వలు మాయమైనట్లు వెల్లడైంది. వరంగల్ జిల్లా సంగెం మండలం కాపులకనిపర్తిలోని సతీష్, శ్రీసాయి ఇండస్ట్రీస్‌లపై రాష్ట్ర సివిల్ సప్లయ్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. 2022–23 ఖరీఫ్, 2023–24 రబీ సీజన్‌లకు ప్రభుత్వం ధాన్యం కేటాయించింది. సతీష్ ఇండస్ట్రీస్‌లో ధాన్యం.. బియ్యం నిల్వలు లేవు. 3951.304 టన్నుల ధాన్యం అమ్ముకున్నారు. దీనికి సంబంధించి రూ.13,21,87,049 అక్రమం జరిగినట్లు అధికారులు గుర్తించారు. శ్రీసాయి ఇండస్ట్రీస్‌లోనూ నిల్వలు లేవు. 2588.044 టన్నుల ధాన్యం మాయమైనట్లు తేల్చారు. వాటి విలువ రూ.8,65,80,486 ఉంటుంది. రెండు మిల్లుల్లో మొత్తం రూ.21,87,67,535 విలువైన ధాన్యం మాయమైనట్లు గుర్తించారు. సివిల్ సప్లయీస్ జిల్లా మేనేజర్ సంధ్యారాణి ఫిర్యాదు మేరకు మిల్లుల యజమానులు నిమ్మాని సతీష్, కుందారపు సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

కురవి మండలంలో..

కురవి : మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మొగిలిచర్ల గ్రామంలోని నవ్య ఇండస్ట్రీస్(మిల్లు)పై రాష్ట్ర సివిల్ సప్లయీ, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ ఎం.ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో అధికారులు శనివారం దాడి చేశారు. 2022–23 యాసంగి సీజన్‌లో ప్రభుత్వం 53,560 క్వింటాళ్ల ధాన్యం సీఎంఆర్ కోసం నవ్య రైస్ మిల్లుకు ఇచ్చింది. 36,420 క్వింటాళ్ల బియ్యం సీఎంఆర్ పెట్టాల్సి ఉండగా, 8,871 క్వింటాళ్ల బియ్యం సీఎంఆర్ పెట్టారని వివరించారు. మిల్లులో 40,513 క్వింటాళ్ల ధాన్యం నిల్వ ఉండాల్సి ఉండగా తనిఖీలో 6,238 క్వింటాళ్ల నిల్వ ఉన్నట్లు, ఇంకా 34,275 క్వింటాళ్ల ధాన్యం తక్కువగా ఉందన్నారు. ధాన్యం విలువ సుమారు రూ.8.36 కోట్లు ఉందని తెలిపారు. మిల్లులో అవకతవకలపై యజమాని నాగరాజుపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. జిల్లా మేనేజర్, సివిల్ సప్లయీ అధికారి ఎస్.కృష్ణవేణి, ఏఎస్ఓ జె.రమేష్, టి.రవీందర్, ఆర్ఐ లక్ష్మి, కురవి ఏఎస్సై సదయ్య ఉన్నారు.

సమాజం కోసం సోషల్‌మీడియా ఉపయోగపడాలి

● ఇన్‌స్టాగ్రాం సాయంతో రూ.21 లక్షల నగదు అందజేసిన రఘు
● అభినందించిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



రఘును సన్మానిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్ : ప్రతి ఒక్కరికీ సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిందని, వాటిని సక్రమంగా వినియోగించి సమాజహితం కోసం ఉపయోగపడేలా చూడాలని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ కోరారు. నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటకు చెందిన ఓ మహిళ ఆకస్మాత్తుగా మరణించడంతో ఆమె ఇద్దరు పిల్లలు దిక్కులేని వారయ్యారు. ఈ అంశాన్ని కురవి మండల కేంద్రానికి చెందిన గంగరబోయిన రఘు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పోస్ట్ చేసి దాతలు ఆదుకోవాలని కోరారు. దాతలు స్పందించడంతో రూ.21లక్షలు రాగా బాధిత కుటుంబానికి ఆర్థికసాయంగా అందింది. విషయం తెలుసుకున్న ఎస్పీ శనివారం గంగరబోయిన రఘును జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి, శాలువా కప్పి సత్కరించారు. మత్తు పదార్థాల వాడకం, గంజాయి వంటి నిషేధిత వస్తువుల అక్రమరవాణా, సైబర్ నేరాల నియంత్రణ, ఈవ్ టీజింగ్ అడ్డుకట్ట వంటి అంశాలను సోషల్ మీడియా వేదికగా ప్రచారం చేయాలన్నారు. తనను గుర్తించి అభినందించి, ఆశీస్సులు అందించిన రాంనాథ్ కేకన్‌కు రఘు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపాడు. మానుకోట రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై సతీష్, దుడ్డెల వినోద్, ఐజేయూ అనుబంధ టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హస్తకళలకు సాంకేతిక పరిజ్ఞానం అవసరం

● రాష్ట్ర హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ



మెటల్ క్లస్టర్‌ను ప్రారంభిస్తున్న నాయుడు సత్యనారాయణ

జనగామ రూరల్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పెంబర్తి హస్తకళలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరమని రాష్ట్ర హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని పెంబర్తి హస్తకళా కేంద్రంలో ప్రభుత్వ పథకం ‘స్కీం ఆఫ్ ఫండ్ ఫర్ రీ జనరేషన్ ఆఫ్ ట్రెడీషనల్ ఇండస్ట్రీస్’ స్ఫూర్తి పథకం ద్వారా మంజూరైన మెటల్ వేర్ క్లస్టర్‌ను సీఐ.ఆర్.డీ.ఏ.పీ. అంతర్జాతీయ కార్యాలయం ఢాకా ప్రాంతీయ అధికారి చంద్రశేఖర్, డాక్టర్ గ్లోరీ స్వరూప డైరెక్టర్ జనరల్ హైదరాబాద్ ప్రాంతీయ అధికారితో కలిసి ఆయన ప్రారంభించారు. స్ఫూర్తి క్లస్టర్ నోడల్ ఆఫీసర్ కె.సూర్యప్రకాష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సత్యనారాయణ మాట్లాడుతూ హస్తకళల అభివృద్ధికి చేయూతనందిస్తామని తెలిపారు. హస్తకళాకారులకు ఈఎస్ఐ హెల్త్‌కార్డులు మంజూరు చేసి వారికి కార్పొరేట్ వైద్యసేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్ గ్లోరీ స్వరూప మాట్లాడుతూ పూర్వకాలం నుంచి చేతివృత్తిపై ఆధారపడుతూ అద్భుతమైన కళాకృతులను తయారు చేస్తున్న కళాకారులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిచయం చేసి యంత్ర పరికరాలతో శ్రమను తగ్గించే ఉత్పత్తి సాధనాల్ని అందించడానికి క్లస్టర్ మంజూరు చేశామన్నారు. డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పెంబర్తి హస్తకళలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువస్తూ వారి జీవనోపాధికి మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించడంలో మా సంస్థ ఎల్లవేళలా సహకరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కో–ఆపరేటివ్ సొసైటీ ఇన్‌చార్జ్ శంకర్‌నాయక్, మెటల్ క్లస్టర్ ప్రెసిడెంట్ రంగు లక్ష్మణచారి, సీనియర్ కళాకారులు ఐలా కీర్తనచారి మాజీ సర్పంచ్‌లు, బాల్దే సిద్ధిలింగం, ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ రవి, సొసైటీ ఇన్‌చార్జ్ అయిలా వేదాంత చారి, సభ్యులు పాల్గొన్నారు.

మలుపు తిరిగిన ‘ధృవ’ దందా

● రియల్ ఎస్టేట్ గొడవలో బీఆర్‌ఎస్ నాయకుల అరెస్టు
● నిరసనగా ఆ పార్టీ నాయకుల ర్యాలీ
● సీపీ, డీసీపీ హామీతో శాంతించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



అక్రమ అరెస్టుపై పోలీసులను నిలదీస్తున్న ఎర్రబెల్లి

దేవరుప్పుల : హైదరాబాద్‌కు చెందిన ‘ధృవ’ ప్రాజెక్టు రియల్ ఎస్టేట్ వ్యాపారుల గొడవ నేపథ్యంలో శనివారం ఇద్దరు బీఆర్‌ఎస్ నాయకుల అరెస్టు, జ్యుడీషియల్ రిమాండ్ సంచలనం రేపింది. వివరాలు ఇలా ఉన్నాయి.. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చిన్నమడూరులో రెండేళ్ల కిందట ధృవ ప్రాజెక్టు (డెవలపర్స్) నిర్వాహకులు స్థానికుల సహకారంతో వ్యాపారం చేస్తుండగా వారి మధ్య ఆర్థిక లావాదేవిల గొడవతో బ్రేక్ పడింది. ఈ నేపథ్యంలో పాండురంగారావు అనే వ్యక్తి ఇటీవల తనను స్థానిక కాంగ్రెస్ నాయకుడు బోనగిరి యాకస్వామి సహకారంతో కిడ్నాప్ చేసి చిన్నమడూరులో 12 ఎకరాలు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారనే ఆరోపణ వచ్చింది. ఈ విషయమై బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు సవాల్‌కు ప్రతి సవాల్ చేసుకున్నారు. గురువారం బీఆర్‌ఎస్ నాయకులు ఫోన్ సంభాషణలతోపాటు కిడ్నాప్ చేసిన ఫిర్యాదుల ప్రతులతో సమావేశాలు నిర్వహించడంతో గొడవ తారాస్థాయికి చేరింది. ఈ విషయమై విచారణ కొనసాగిస్తున్న పోలీసులు శనివారం ధృవ ప్రాజెక్టు నిర్వాహకుడు కాసాని ఉమామహేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు చిన్నమడూరుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గొడుగు మల్లికార్జున్, వంగ అర్జున్‌ను విచారణ పేరిట పిలిచారు. వీరిని వెంటనే జనగామ కోర్టులో హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించారు. దీంతో కోపోద్రిక్తులైన బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో కలిసి పలువురు నేతలు అక్రమ అరెస్టుకు నిరసనగా ర్యాలీ చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ర్యాలీని అడ్డుకొని సముదాయించి సత్వర విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో శాంతించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ఊరుకోబోమని హెచ్చరించారు. అనంతరం భూదందాలకు ఆజ్యం పోసేలా కిడ్నాప్‌నకు గురయ్యారన్న పాండురంగారావు విషయమై నిగ్గు తేల్చాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పల్ల సుందర్‌రామిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ ఆధ్వర్యంలో ఎస్సై సృజన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. కాగా ఇదే విషయమై ఎస్సైను వివరణ కోరగా రియల్ ఎస్టేట్ విషయంలో కాసాని ఉమామహేశ్వర్‌రావు పర్మిషన్ కోసం వెళ్లగా ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులైన మల్లికార్జున్, అర్జున్ తరుచూ ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడ్డట్లు చెప్పారు. అలాగే గూగుల్, ఫోన్‌పే ద్వారా రూ.9.25 లక్షలు బదిలీ చేసుకున్నట్లు వాటి ఆధారంగా కేసు నమోదు చేశామన్నారు.

లాంగ్ లీవ్‌లో సబ్ రిజిస్ట్రార్లు..!

కాజీపేట అర్బన్ : ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి జూలై 31వ తేదీన జోన్ బదిలీల్లో భాగంగా ఖమ్మం జిల్లాకు ట్రాన్స్‌ఫర్ అయిన సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిస్టెంట్లు సుమారు ఎనిమిది మంది లాంగ్ లీవ్‌లో వెళ్లినట్లు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, మధిర వంటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు సుమారు 200 కిలోమీటర్ల పై దూరంలో ఉండడంతో అక్కడ పనులు కొనసాగించలేక సెలవులో వెళ్లినట్లు తెలిసింది. కాగా కొందరు ఉద్యోగులు మ్యూచ్‌వల్ ట్రాన్స్‌ఫర్‌కు, స్పౌజ్ కోటాలో ట్రాన్స్‌ఫర్ కల్పించాలని ఉన్నతాధికారులతో పాటు ప్రజా ప్రతినిధులను వేడుకుంటున్నట్లు సమాచారం.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

PLAY SCHOOL TEACHERS JOB

■ గిజుబాయ్ సెట్విన్ వారి దసరా Pre School టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాం (PPTTC) ప్లేవే మెథడ్ బోధన Oct 2 నుండి ప్రారంభం. ట్రైనింగ్‌కి హాజరై SETWIN ద్వారా Govt. సర్టిఫికేట్ & ఉద్యోగం పొందండి, 7382733795, 9491818630 HNK [W-1240000]

REAL ESTATE

PLOTS FOR SALE

■ ఓగ్లాపూర్ పవర్‌గ్రిడ్‌కు ఎదురుగా 200 ఫీట్ రోడ్డుకి ఆనుకొని కాంపౌండ్ కట్టి ఉన్న ప్లాటు (వెడల్పు 30 పొడవు 120) 400 చ॥గ॥ ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 9701218888. [W-1237301]

■ HNK KITS, అంబాల రోడ్, ముచ్చర్ల రోడ్ New Highwayకు 100 మీ॥ సమీపంలో గ॥ 166 & 333 & 466 గజాల ప్లాటు కలవు. సంప్ర॥ 9553255936. [W-1239991]

SERVICES

OLD AGE HOME

■ హన్మకొండ వడ్డేపల్లి నందు ఆధునిక వసతులతో గత పది సంవత్సరాల నుండి 50 మంది వృద్ధులకు సేవలు అందిస్తూ నూతనంగా బ్లాకు అందుబాటులోకి తేవడం జరిగింది. దయచేసి సంప్రదించగలరు. 9848444020, 9110551507. [W-1239906]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు. సెల్: 9849145043 [W-1239959]

BUSINESS OFFER

■ స్త్రీ/పు.రూ.1-5 లక్షల పెట్టుబడితో మీ ఆఫీస్/మీవద్ద నుండే ఫుడ్‌ప్రొడక్ట్స్ తయారు చేస్తూ/స్టాక్ పాయింట్స్/ బిజినెస్ ఫ్రాంచైజ్ నిర్వహిస్తూ, ప్రతినెల రూ.50,000 ఆపైన ఫిక్స్‌డ్ సంపాదన పొందండి ! 7013544075, 7842877904. [H-782717]

■ పెట్టుబడి పెట్టండి, అధిక లాభాలు పొందండి, మాది అతిపెద్ద రైస్ & ఫుడ్ బిజినెస్, పార్టనర్స్ కావలెను, రోజూ లారీ రైస్ అమ్మును, 29వేలు లాభం, రిటైరైన వారు, ఫైనాన్స్ ఇన్వెస్ట్ చేయువారు,కొత్తగా వ్యాపారంపెట్టేవారు, బిజినెస్‌లో ఆసక్తి గల & ఏ జాబ్ లేనివారు డైరెక్ట్ : 8978216240. [HA-2404]

■ మీరు ఒక దుకాణదారా? మీకు ప్రతి నెలా ఆదాయం కావాలా? మీ దుకాణంకి ప్రచార ప్రకటనలు జోడి చేసి ప్రతి నెలా 7000/– ఇస్తాము. Contact Numbers: 9948000374, 9948000373 [H-1241126]

WANTED

■ Wanted Civil Engineer's Male Only + Marketing Executives for Sai Manikanta Reddy Mix Concrete Diploma/B.Tech, Civil with 2 years Experience Drop your Resume on Whatsapp No's 7670956668, 7330871166, 8555890439, 9849277408. [WA-14711]

■ Urgent Required Backend Executive (Back Office Operations) Day Shift, Preferred: Female Salary 10K+ Cont: 9618290901 HNK. [WA-14712]

■ RK Real Estat: హన్మకొండ ఆఫీస్ యందు పనిచేయుటకు అనుభవం గల లేడి టెలికాలర్స్ కావలెను. సంప్ర॥ 8977429273. [W-1239997]

■ హన్మకొండ ఏరియాలో గల జ్యూస్ పాయింట్‌లో పనిచేయుటకు వర్కర్స్ కావలెను. వయస్సు 40-50 సం॥లోపు వారు కావలెను. మంచి జీతం. సంప్ర॥ 9705208070 [W-1239913]

■ త్రివేణి హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను /పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీ:18K. Ph: 9160900024,9640400073. [H-796277]

■ షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో నర్సులు, కాంపౌండర్స్, వార్డ్ బాయ్స్, ఆయాలు, లేడి సూపర్‌వైజర్స్ భార్యభర్తలు కావలెను.Ph: 9391036931, 9246585901 [HA-14711]

■ వరంగల్ మినీ ట్యాంక్ బండ్ రోడ్ షో సేల్స్ చేయడానికి వర్కర్స్ కావలెను. (Male/Female) జీతం: 10k. Cell: 6302280020 [SCA24000258]

■ భువనగిరిలో ఉన్న డాక్టర్స్ ఫ్యామిలీ వద్ద వంటపని, ఇంటిపని, ఇంట్లో పెట్టపని చేయుటకు భార్యాభర్తలు కావలెను. ఫ్యామిలీకి జీతం : 23,000/- + రూం ఫ్రీ. ఫోన్ : 92469 69042, 98481 75211 [V- 2691]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

www.sakshi.com